సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 1 । నవంబర్ । 2022



పర్యాటక ప్రాంతంగా సీతమ్మకొండ
- గొడుగురాయి జలపాతం వద్ద కాటేజీలు
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ 8లో



అవధుల్లేని ఆనందం 8లో
- మినీ జాబ్‌మేళాకు విశేష స్పందన
- దరిచేరుతున్న ఉపాధి అవకాశాలు

భూ రీసర్వే వేగవంతం



రికార్డులు తనిఖీ చేస్తున్న జేసీ శివ శ్రీనివాస్ 8లో

న్యూస్‌రీల్

చిన్న పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ లలితాకామేశ్వరి

రంపచోడవరం: చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా గిరిజనులు ఆర్థికంగా బలోపేతం కావాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ లలితాకామేశ్వరి అన్నారు. రంపచోడవరం సమీపంలోని పందిరిమామిడి కేవీకేలో సోమవారం పుట్టగొడుగుల పెంపకంపై మూడు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. పుట్టగొడుగుల పెంపకంపై శాస్త్రవేత్త చిరంజీవి గిరిజన యువతకు అవగాహన కల్పించారు. చిన్న యూనిట్ల ఏర్పాటు ద్వారా పుట్టగొడుగుల పెంపకం చేపట్టాలని కోరారు. ఇందుకు తగిన సహకారం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'గెస్ట్ టీచర్' అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన



ఎంవీ రమణ

రాజవొమ్మంగి: రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని ఆరు ఏకలవ్య మోడల్‌స్కూళ్లలో గెస్ట్ టీచర్ల పోస్టులకు సంబంధించి అభ్యర్థుల చేసుకున్న దరఖాస్తులను సోమవారం నుంచి పరిశీలించనున్నట్లు ఏకలవ్య విద్యాలయాల కన్వీనర్ ఎంవీ రమణ తెలిపారు. రంపచోడవరం పీఎంఆర్‌సీలో మూడవ తేదీ వరకు అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలిస్తామని చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

3,08,156 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు పూర్తి

- సవరణకు అభ్యంతరాల స్వీకరణ
- జిల్లా వ్యవసాయాధికారి నందు

పాడేరు రూరల్: జిల్లాలో ఇప్పటి వరకు 3,08,156 ఎకరాల్లో ఈ–పంట నమోదు ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బీఎస్ నందు తెలిపారు. సామాజిక తనిఖీల్లో భాగంగా జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అక్టోబర్ 28 నుంచి నవంబర్ 1 వరకు చేపట్టిన ఈక్రాప్ నమోదు ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తున్నామని చెప్పారు. మార్పులు, చేర్పుల అనంతరం తుది జాబితా ఈనెల 5న రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. ముసాయిదా జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సవరణ కోసం రైతు భరోసా కేంద్రాల్లోని వీఏవీ, వీహెచ్‌ఏ, ఏఎస్‌ఏలను సంప్రదించి అభ్యంతరాలను రాతపూర్వకంగా ఇవ్వాలని సూచించారు. ఈక్రాప్ 2022 సవరణకు ఇదే చివరి అవకాశమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

చింతూరు సబ్ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



చింతూరు సబ్ కలెక్టర్, పీవోగా బాధ్యతలు చేపడుతున్న ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

చింతూరు: స్థానిక రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషిచేసేందుకు తనను సబ్ కలెక్టర్, పీవోగా నియమించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు మండలాల్లో ప్రధానంగా విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మారుమూల గ్రామాల్లో మౌళిక సౌకర్యాల కల్పనకు కృషి చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు పేదలందరికీ చేరేలా తగిన చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. పోలవరం ఆర్‌అండ్ఆర్, భూసేకరణ సమస్యలకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకుని నిర్వాసితుల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఐటీడీఏ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అభినందనలు తెలిపారు.

ధర బాగున్నా.. సహకారం కరువై..

- ప్రాభవం కోల్పోతున్న వైట్ బర్లీ పొగాకు సాగు
- ఒకప్పుడు రాజవొమ్మంగి నుంచి మిగతా జిల్లాలకు విస్తరణ
- ఇప్పుడు అదే స్థాయిలో పంటకు దూరమవుతున్న రైతులు

మెట్ట ప్రాంతాల్లో సిరులు కురిపించే పంటల్లో వైట్ బర్లీ (పొగాకు) ఒకటి. తొలుత రాజవొమ్మంగి ప్రాంత రైతులు సాగు చేపట్టిన ఈ పంట కొయ్యూరు, అనకాపల్లి జిల్లాలో గొలుగొండ, కృష్ణదేవిపేట, నాతవరం, కోటవురట్ల మండలాలకు విస్తరించింది. రైతులు మంచి ఆదాయం పొందేవారు. ఇప్పుడు హోల్‌సేల్ మార్కెట్లో ధర బాగున్నా తగిన ప్రోత్సాహం లేకపోవడంతో రైతులు సాగుకు దూరమవుతున్నారు.



పాకలో ఆరబెట్టిన పొగాకు

రాజవొమ్మంగి: ఏజెన్సీలో ఒకప్పుడు గిరి రైతులకు సిరులు కురిపించిన బర్లీ పొగాకు సాగు రానురాను ఇప్పుడు ప్రాభవం కోల్పోతోంది. ఎలాంటి నేలలోనైనా పండే పంటల్లో ఇదొకటి. సాగునీరు లేకున్నా తట్టుకుంటుంది. కోతులు, పశువుల బెడద ఈ పంటకు తక్కువే. అందుకే మెట్ట ప్రాంత రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపేవారు.

రెండు వేల ఎకరాల్లో..

ఈ ఏడాది మండలంలోని అమీనాబాద్, లాగరాయి, లబ్బర్తి, రాజవొమ్మంగి, అడ్డతీగల మండలం వీరభద్రపురం, జే. అన్నవరం, కొయ్యూరు మండలంలోని కంఠవరం, బాలారం, కృష్ణదేవిపేట తదితర ప్రాంతాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. వైట్ బర్లీ పొగాకు సాగు చేపట్టే రైతులకు గతంలో కొన్ని ప్రైవేట్ కంపెనీలు పోత్సహించేవి. ఐటీసీ, ఎంఎల్, నాగార్జున తదితర కంపెనీలు రైతుల నుంచి కొనుగోలు చేసేవి. అప్పటిలో రైతులకు నారుమొక్కలు, ఎరువులు, పురుగు మందులు అందజేసేవి. అంతేకాకుండా రుణాలు, పురుగుమందులు, ఎరువులు, పొగాకు



పొగాకు ఆకులు సేకరిస్తున్న మహిళా రైతులు

ఆరబెట్టుకునేందుకు పాకల ఏర్పాటుకు సహకారం అందించేవి. పంట కొనుగోలు సమయంలో వీటిని మినహాయించి మిగతా మొత్తాన్ని చెల్లించేవి.

కేవలం నారు మాత్రమే సరఫరా..

ఇప్పుడు కేవలం నారు మాత్రమే సరఫరా చేస్తున్నాయని రైతులు తెలిపారు. ఒక ఎకరానికి సుమారు 10వేల నారు మొక్కలు అవసరం. ప్రైవేట్ కంపెనీలతో సంబంధం లేకుండా కొంత మంది రైతులు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి నారు తీసుకొని వచ్చి నాటారు. ఈఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున పైరు ఆశాజనకంగా ఎదిగింది. ఎకరాకు 600 కిలోల నుంచి టన్ను వరకు దిగుబడి

రావచ్చని రైతులు ఆశిస్తున్నారు. టన్ను పొగాకు ధర రూ.లక్ష వరకు ఉండవచ్చని రైతులు తెలిపారు. ఎకరాకు సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి కాగా, రూ. 50 వేలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతులు అత్యధిక దిగుబడినిచ్చే వీబీహెచ్ 8,3,5 వంగడాలను సాగు చేస్తున్నారు. ఎకరాకు అవసరమైన పది వేల మొక్కలు రూ.4 వేల ధర నిర్ణయించి కంపెనీలు సరఫరా చేస్తున్నాయి.

ఇంటిల్లిపాదికి పని..

పొగాకు సాగు చేపట్టిన రైతులకు ఇంటిల్లిపాదికి చేతి నిండా పని దొరుకుతుంది. బయట పనులకు వెళ్లనవసరం లేకుండా ఇంటి వద్దనే పొగాకు పనుల్లో ఈ రెండు నెలలు బిజీగా ఉంటారు. రెండు నెలల క్రితం నాటిన పొగాకు మొక్కలు నేడు ఏపుగా పెరిగి ఆకులు రెలుపునకు (సేకరణ) వచ్చాయి. వీటిని తోరణాలుగా గుచ్చి తాటాకు పాకల్లో, షెడ్లలో ఆరబెడుతున్నారు. నెల రోజుల అనంతరం బాగా ఎండిన పొగాకును సుమారు వంద కిలోల బరువు ఉండేలా బేళ్లుగా కట్టి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తామని రైతులు తెలిపారు.

గతేడాది కిలో రూ.105..

జడ్డంగి, రాజవొమ్మంగి, చెరకుంపాలెం, లబ్బర్తి, లాగరాయి తదితర ప్రాంతాల్లో డిసెంబర్ చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తాయి. రంగు, వాసన తదితర నాణ్యత ప్రమాణాలను బట్టి కంపెనీలు ధర నిర్ణయిస్తాయి. గతేడాది కిలో ధర రూ.105 పలికిందని రైతులు తెలిపారు. ఈ ఏడాది సుమారు 8 లక్షల కిలోల పొగాకు దిగుబడి రావచ్చని కంపెనీలు అంచనా వేస్తున్నాయి.

సంక్రాంతికి ఆదాయం



ఎన్నో ఏళ్లుగా పొగాకు సాగు చేస్తున్నాం. ఖర్చులు పోను ఎకరాకు రూ. 30 నుంచి రూ.50 వేలు మిగులుతుంది. అయితే బాగా కష్టపడి పనిచేయాలి. మూడు నెలల పాటు పడిన కష్టానికి సంక్రాంతి నాటికి ఒకే సారి సొమ్ము చేతికి వస్తుంది.

–మిరియాల రాజుబాబు, గిరిజన రైతు, లబ్బర్తి.

వైట్ బర్లీ సాగే ఆధారం



మా భూమి ఎత్తుపల్లాలతో ఉంది. ఇటువంటి భూమి వర్షాధారంగా పొగాకు సాగు చేపట్టేందుకే మాత్రమే పనికి వస్తుంది. ఎకరా నేలలో పొగాకు మొక్కలు వేస్తే ఇంటిల్లి పాదికి పని సరిపోతుంది. బాగా అలవాటు పడటం వల్ల పొగాకు పంటపైనే ఆధారపడ్డాం.

–చప్పా సూరిబాబు, పొగాకు రైతు, లబ్బర్తి

కష్టపడితే మంచి భవిష్యత్తు



అంబేడ్కర్ సెంటర్‌లో మానవ హారం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- పాడేరులో ఘనంగా జాతీయ సమైక్యత ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: యువత కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు పొందవచ్చని కలెక్టర్‌ఆ సుమిత్‌కుమార్ సూచించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని పాడేరులో జాతీయ సమైక్యత ర్యాలీని సోమవారం ఘనంగా నిర్వహించారు.తలారిసింగి జంక్షన్ వద్ద ఆయనతో పాటు, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణలు జెండా ర్యాలీని ప్రారంభించారు. ఐటీడీఏ, సినిమాహాల్ సెంటర్ మీదుగా పాతబస్టాండ్‌వరకు ర్యాలీ సాగింది. అంబేడ్కర్ సెంటర్‌లో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. జాతీయ సమైక్యత పెంపొందించేలా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఆశయసాధనే లక్ష్యంగా యువత పనిచేయాలని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. జాతీయ సమైక్యత భావాన్ని నిర్మించిన మహానుభావులు, స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు చరిత్రలో నిలుస్తాయన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్‌సతక బుల్లిబాబు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఐక్యత భావం పెంపొందించుకోవాలన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ఫిట్‌నెస్ చాలా అవసరమని, వ్యాయామం అలవర్చుకోవాలని ఆయన కోరారు. ఎస్పీ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో జాతీయ సమైక్యత ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే కొట్టగుల్ల భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సబ్ కలెక్టరు తదితరులు

చింతూరు: జాతీయ ఐక్యతా దినోత్సవం పురస్కరించుకుని సోమవారం చింతూరులో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెయిన్‌రోడ్ సెంటర్లో విద్యార్థులతో కలసి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జాతీయ సమైక్యత కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఈ–42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ దివాకరరావు, సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ యాదగిరి పాల్గొన్నారు.

ఘన నివాళి..

సాక్షి,పాడేరు: సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశసమగ్రత, ఐక్యత, భద్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు, డీపీఆర్వో గోవిందరాజులు పాల్గొన్నారు.



సర్దార్ వల్లభాయ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



చింతూరులో మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

శైవక్షేత్రాలకు కార్తీక శోభ

- పోటెత్తిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

సాక్షి,పాడేరు: కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మత్స్యగుండానికి భక్తులు భారీగా తరలివచ్చారు. స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులు పూజలు చేశారు. ఆలయ



మత్స్యగుండంలో మత్స్యలింగేశ్వరస్వామికి పాలాభిషేకం చేస్తున్న పూజారి

ధర్మకర్త కొట్టగుల్లి సింహచలంనాయుడు,రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. పాత పాడేరు పురాతన శివాలయంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ పూజలు చేశారు.

ఆలయం చుట్టూ కూర్మం ప్రదక్షిణ



వినాయకుడి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కూర్మం

ఎటపాక: మండలంలోని గన్నవరం గ్రామంలోని విఘ్నేశ్వర ఆలయం చుట్టూ కూర్మం (తాబేలు) ప్రదక్షిణలు చేసింది. కార్తీకమాసం తొలి సోమవారం తెల్లవారు జామున ప్రదక్షిణలు చేస్తున్న తాబేలును చూసేందుకు భక్తులు తరలివచ్చారు. గ్రహణం అనంతరం తాబేలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం శుభసూచకమని ఆలయ అర్చకుడు వెంకటేశ్వరశాస్త్రి తెలిపారు.

4,5 తేదీల్లో మెగా సదరం శిబిరం

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: చింతపల్లి మండల కేంద్రంలో ఈనెల 4,5 తేదీల్లో ప్రత్యేక మెగా సదరం శిబిరం నిర్వహిస్తున్నామని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. సదరం క్యాంపు నిర్వహణపై జిల్లా ఆస్పత్రి వైద్యాధికారులు, చింతపల్లి ఏరియా ఆస్పత్రి వైద్యాధికారులతో ఐటీడీఏ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కేజీహెచ్, ఇతర ముఖ్యమైన ఆస్పత్రుల వైద్య నిపుణులు సదరం శిబిరంలో పాల్గొంటారన్నారు. కంటి వైద్య నిపుణులు, ఎముకల వైద్య నిపుణులు, మానసిక వైద్య నిపుణులు, ఈఎన్‌టీ వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు, తదితర 27 మంది వైద్యులు పాల్గొని వైద్య సేవలందిస్తారన్నారు. అంగవైకల్యాన్ని సక్రమంగా పరీక్షించి సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు. జి.మాడుగుల, జి.కె.వీధి,



సమావేశం నిర్వహిస్తున్న పీవో గోపాలకృష్ణ

చింతపల్లి, కొయ్యూరు మండలాలకు చెందిన దివ్యాంగులంతా సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి ఐటీడీఏ నుంచి అన్ని విధాల సహకారం అందిస్తామన్నారు. వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. చింతపల్లిలో శస్త్ర చికిత్సల నిర్వహణకు వైద్యాధికారులు చొరవ చూపించాలన్నారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర ప్రసాద్, శస్త్ర చికిత్సల వైద్య నిపుణులు డాక్టర్ రవికిరణ్, చింతపల్లి ఆస్పత్రి సీనియర్ స్త్రీల వైద్యురాలు డాక్టర్ సుధా శారద, డాక్టర్ కీర్తి, డాక్టర్ కిల్లో రమేష్ పాల్గొన్నారు.

నాణ్యత లేకుంటే చర్యలు తప్పవు

- బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ
- మధ్యాహ్న భోజనం పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి
- చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

చింతూరు: విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో నాణ్యత పాటించకుంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక నర్సింహపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు విరిగిపోయిన పెరుగు, నీళ్ల మాదిరిగా ఉన్న సాంబారును వడ్డించడంపై సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. విద్యార్థులకు పెడుతున్న ఆహారం విషయంపై సరైన పర్యవేక్షణ లేదని, ఇకపై ప్రతిరోజూ ఆహార నాణ్యతను పరిశీలించేందుకు ఐటీడీఏ ద్వారా ప్రత్యేక అధికారిని నియమిస్తామని ఆయన తెలిపారు. మెనూ సక్రమంగా పాటించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని క్లాసురూంలు, మరుగుదొడ్లు, లైబ్రరీని పరిశీలించిన ఆయన



ఆశ్రమ పాఠశాలలో పెరుగు నాణ్యతను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

విద్యార్థులతో మాట్లాడారు.

ఆస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు

వైద్య సౌకర్యాలు మెరుగుకు అన్ని చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన సందర్శించారు. వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ నియామకంతో పాటు ఖాళీ వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్కానింగ్ సెంటర్, తాగునీరు ఏర్పాటుకు కృషి చేస్తానని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.

నిరుద్యోగుల చెంతకే ఉద్యోగాలు

- ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం
- అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- శరభన్నపాలెంలో మినీ జాబ్‌మేళా విజయవంతం
- 250 మంది ఎంపిక

కొయ్యూరు: నిరుద్యోగుల చెంతకు కంపెనీలు వచ్చి ఎంపిక చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని శరభన్నపాలెంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. అభ్యర్థులు 600 మంది హాజరుకాగా, 250 మందిని వివిధ కంపెనీల ప్రతినిధులు ఎంపికచేశారు. వీరిలో మహిళలు ఎక్కువ మంది ఉన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రతీఒక్కరు తల్లిదండ్రులపై ఆధారపడకుండా సొంతంగా ఎవరి కాళ్లపై వారు నిలబడే విధంగా ఉండాలన్నారు. ఉద్యోగంతోపాటు వసతి, భోజన సౌకర్యం కల్పించడం సంతోషకరమన్నారు. గిరిజనులకు బాగా కష్టపడే తత్వ ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పక్కన అరకు ఎంపీ మాధవి

నిరుద్యోగుల కోసం ప్రభుత్వం జాబ్‌మేళాలు నిర్వహిస్తూ అండగా ఉంటుందన్నారు. అతి మారుమూల ప్రాంతమైన శరభన్నపాలెంకు కంపెనీ ప్రతినిధులు రావడం అభినందనీయమన్నారు. అంతకుముందు వారు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ మాట్లాడుతూ నేడు ఉద్యోగాల కల్పనకు కంపెనీలు గ్రామాల్లోకి వస్తున్నాయంటే అది సీఎం జగన్‌మోహనరెడ్డి చేసిన గొప్పపనిగా చెప్పారు. నిరుద్యోగులు నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా ఉద్యోగాలు వస్తాయన్నారు సెంట్రల్ ఫార్మసీ ఎండీకె రామారావు,సంస్థ ఇంచార్జీ కోటేశ్వరరావు,



సర్దార్ వల్లభాయ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

మోహన్ ఇంటెక్స్ కంపెనీకి చెందిన రాంబాబు, మదర్ ఫాదర్ నర్సింగ్ కంపెనీకి చెందిన ప్రతినిధులు మాట్లాడారు. నర్సింగ్‌కు సంబంధించి రూ.15 వేల వేతనంతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు.శిక్షణ కాలంలో జీతాలు ఇస్తామన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థకు చెందిన రోహిణి, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారానూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు జల్లిబాబులు, మహిళా నేత రాజులమ్మ, గాడి సత్యనారాయణ, సర్పంచ్ కె.సత్యనారాయణ, ఎంపీటీసీ లోకుల సోమాగాంధీ, తహసీల్దార్ తిరుమలరావు, పార్టీనేత గొడ్డేటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా సీతమ్మకొండ

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

హుకుంపేట: ఉత్తరాంధ్రలో అత్యంత ఎత్తయిన ప్రాంతంగా గుర్తింపు పొందిన సీతమ్మకొండ(జెండాకొండ)ను పర్యటక ప్రాంతాంగా అభివృద్ధి చేస్తామని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. మండలంలోని తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డా గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. దీనిలో భాగంగా సముద్ర మట్టానికి 5,526 అడుగుల ఎత్తులో ఉన్న సీతమ్మకొండపై ఆహ్లాదకర పరిసరాలను ఆయన పరిశీలించారు. జెండాకొండ పర్యటక సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. జెండాకొండ అభివృద్ధికి అవసరమైన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభ తీర్మానంతో ప్రతిపాదనలు వంపిస్తే సీతమ్మకొండకు రహదారి నిర్మిస్తామని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో రహదారిలో అవసరమైనచోట కల్వర్టులు నిర్మించాలని ఎంపీడీవోను ఆదేశించారు. పర్యాటకులు కొండపైకి వెళ్లేందుకు వాహనాలు సమకూర్చాలని నిర్వాహకులకు సూచించారు. విద్యుత్, తాగునీరు సదుపాయాలు కల్పిస్తామన్నారు. పర్యాటకుల వాహనాలు నిలువుదలకు, టోల్‌గేటు ఏర్పాటుకు స్థలాలు గుర్తించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో రహదారి నిర్మాణానికి డీఎల్‌సీలో అనుమతులు తీసుకుంటామన్నారు. గ్రామానికి బీఎస్‌ఎన్‌ఎల్ నెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. అనంతరం గొడుగురాయి, గుడ్డిగుమ్మి, హండి జలపాతాలను పరిశీలించారు. గొడుగురాయి జలపాతం ప్రాంతాల్లో కాటేజీలు నిర్మిస్తామని అన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ కొర్ర నాగరాజు, కమిటీ అధ్యక్షులు జానకి, సాధు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరి

గృహ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సూచించారు. సోమవారం ఆయన కొట్నాపల్లిలో పీఎం ఆవాస్ యోజన-వైఎస్ఆర్(గ్రామీణ) పథకంలో భాగంగా నిర్మిస్తున్న గృహాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రతీ ఇంటికి రూ.1.8 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుండగా స్వయం సహాయక సంఘం నుంచి మరో రూ.35వేలు అందిస్తారన్నారు. ఇళ్ల నిర్మాణ స్థాయిని బట్టి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, సర్పంచ్ బొంజుబాబు పాల్గొన్నారు.



కొట్నాపల్లిలో ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న పీవో గోపాలకృష్ణ, ప్రజాప్రతినిధులు

సకాలంలో పనులు పూర్తి చేయాల్సిందే

- స్పందించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: వివిధ పథకాల కింద మంజూరైన రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల ప్రగతిపై ఆయన తన కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తి చేయని, పనులపై స్పందించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని, వారికి పెనాల్టీలు విధించాలని ఆదేశించారు. జిల్లాకు పీఎంజీఎస్‌వై, ఎల్‌డబ్ల్యూఈఏఆర్‌సీపీ పథకాల కింద 73 పనులు మంజూరయ్యాయన్నారు. వీటిలో వాటిలో 17 పనులు పూర్తి కాగా 41 పనులు వివిధ స్థాయిలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఆరు పనులకు సంబంధించి కొంత భాగం అటవీ ప్రాంతంలో ఉన్నందున అవసరమైన మంజూరు పొందాలని కోరారు. మిగిలిన తొమ్మిది పనులు పూర్తిగా అటవీ క్లియరెన్స్ తీసుకోవాల్సి ఉన్నందున త్వరగా తగు ప్రతిపాదనలు పొంది అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పనికి సంబంధించి ఆయా డీఈఈ, ఏఈఈలతో చర్చించిన కలెక్టర్ సంబంధిత కాంట్రాక్టర్‌తో వ్యక్తిగతంగా చర్చించి తగిన సూచనలు జారీ చేశారు. అందుబాటులో లేని కాంట్రాక్టర్లకు ఫోన్‌చేసి పనులు పూర్తికి సమయాన్ని నిర్దేశించారు. పనులు పూర్తికి సహకారం అందిస్తామని, అందుకు తగ్గట్టుగా పూర్తి చేయకుంటే సహించేది లేదని హెచ్చరించారు. వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. అనంతరం ముఖ్య కార్యదర్శికి ఫోన్ చేసి నిధులు మంజూరుకు హామీ పొందారు. ఇప్పటికే గత 15రోజులుగా వర్షాలు ఆగిపోయాయని, అయినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వారంలోగా పనులు ప్రారంభించకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీఐయు ఇఇ కె.లావణ్యకుమార్, డీఈఈలు పి.మధు, బి.రవికుమార్, కాంట్రాక్టర్లు శేషారెడ్డి, పేరా రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భూ రీసర్వే వేగవంతం

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. వీఆర్వో, ఆర్ఐలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న భూ రీసర్వేను వేగవంతం చేయాలన్నారు. ప్రతి వారం సర్వేపై నివేదికలు సమర్పించాలని డీటీ ముజీబ్‌కు ఆదేశించారు. ఆర్ఐ హరి, వీఆర్వోలు రవి, ప్రసాద్, ఝాన్సీ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎటపాక: భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మండలానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎటపాక ఎస్ఐ పార్థసారధి తెలిపిన వివరాలివి. మండలంలోని విస్సాపురం పంచాయతీ పరిధిలోని వినాయక పురం గ్రామానికి చెందిన కె.రామయ్య (47)కు ఏడాదిగా మానసిక స్థితి సరిగ్గా లేదు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఉన్న పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని బంధువులు భద్రాచలం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు

రంపచోడవరం: స్పందనలో అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి నిర్వహించిన స్పందనలో 90 అర్జీలు స్వీకరించారు. వీటిలో పోలవరం ఆర్అండ్ఆర్ అమలు దరఖాస్తులు, వ్యక్తిగ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని వారు తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎటపాక: మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకు అదుపు తప్పి పడి ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. భద్రాచలం సుభాష్ నగర్‌కు చెందిన ఎల్ శ్రీనివాస్, కె.సత్యనారాయణ బైకుపై ఎటపాక వచ్చి తిరిగి భద్రాచలం వెళ్తుండగా ఏటపాక జాతీయ రహదారిలోని పురుషోత్తపట్నం గ్రామం వద్ద బైకు అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. వారిని భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పార్థసారధి తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

పాడేరు రూరల్: పాడేరు-జి.మాడుగుల ప్రధాన రహదారి మెట్ట బంగ్లా వద్ద ఆర్టీసీ బస్సు చక్రాల కింద ద్విచక్ర వాహనం దూసుకెళ్ళిన సంఘటనలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పెదబయలుకు చెందిన కిరణ్ అనే యువకుడు సోమవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంలో జి. మాడుగుల వైపు వెళ్తుండగా జి. మాడుగుల నుంచి పాడేరు వస్తున్న ఆర్టీసీ బస్సు మెట్ట బంగ్లా మలుపు వద్ద బలంగా ఢీ కొట్టడంతో బస్సు ముందు చక్రాల కింద పడిపోయాడు. దీంతో అతడి తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అతడి పరిస్థితి మరింత విషయంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు పాడేరు జిల్లా ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

జాతీయ రహదారి భూముల పరిశీలన

జి.మాడుగుల: జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్న భూములను సోమవారం పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ పరిశీలించారు. మండలంలోని వరిగెలపాలెం, పినకిల్తారి, కృష్ణాపురం గ్రామాల్లో నిర్మిస్తు నేషనల్ హైవే516 ప్రాంతాన్ని సందర్శించారు. దీని నిర్మాణంలో నష్టపోతున్న భూములు, ఇళ్ల వివరాలపై విచారణ చేసి నివేదించాలని తహసీల్దార్ అప్పలస్వామిని ఆయన ఆదేశించారు.కార్యక్రమంలో తహసీల్దార్ కె అప్పలస్వామి, వీఆర్వో, సచివాలయ సర్వేయర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

మంచి లక్ష్యాలతో సాగాలి

రంపచోడవరం: విద్యార్థులు మంచి లక్ష్యాలు ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం. జగన్నాథరావు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. డిగ్రీ తరువాత మంచి స్థాయిలో ఉండేందుకు మంచి రంగాలను ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డి.రవికుమార్, సీనియర్ అధ్యాపకులు చక్రవర్తి, భరత్ పాల్గొన్నారు.

అవధుల్లేని ఆనందం

- మినీ జాబ్‌మేళాలో గిరి యువత ప్రతిభ
- కొలువులు సాధిస్తూ.. కుటుంబానికి అండ

కొయ్యూరు: మండలంలోని శరభన్నపాలెంలో సోమవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళా ఎంతోమంది నిరుద్యోగులకు బాసటగా నిలిచింది. ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచి కొలువులు సాధించి కుటుంబాల్లో ఆనందం నింపారు. వై.రామవరం మండలంలోని మారుమూల ప్రాంతం పాతకోటకు చెందిన గొర్లె దేవీ ప్రసాద్ మదర్, ఫాదర్ జనరల్ నర్సింగ్ విభాగంలో ఉద్యోగం సాధించాడు. అతని తండ్రి కృష్ణయ్యను మావోయిస్టులు 1991లో చంపేశారు. ఈ తరుణంలో పది వరకు చదువుకున్న దేవిప్రసాద్ ఉద్యోగాల వేటలో పడ్డాడు. చివరకు శరభన్నపాలెంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికయ్యాడు. ఆయన ఎంపీ గొడ్డేటి మాధవి నుంచి నియామకపత్రం తీసుకుంటున్న సమయంలో భావోద్వేగానికి గురయ్యాడు. తన తండ్రిని గతంలో మావోయిస్టులు చంపేశారని, ఎలా బతకాలో తెలియక ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ అవకాశం వచ్చిందని ఆనందంతో తెలిపాడు. చదువుకుని ఉపాధి లేకుండా ఉన్న వారిలో చాలా మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయి.వారి బాధలను, పడుతున్న కష్టాలను ఎంపీకి మాధవి దృష్టికి తీసుకువెళ్లారు.

ఆనందంగా ఉంది



జాబ్‌మేళాలో ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉంది. కష్టాల నుంచి త్వరలో గట్టెక్కే అవకాశం ఏర్పడింది. జీఎన్‌ఎంకు ఎంపిక కావడంతో ఉద్యోగంతో పాటు అనుభవం కూడా వస్తుంది. ఎంపీ మాధవి చొరవ చూపి ఇక్కడ జాబ్‌మేళా ఏర్పాటు చేయకుంటే పరిస్థితి మరోలా ఉండేది. ఆమెకు ధన్యవాదాలు.

– సెగ్గే రాజేశ్వరి, రామరాజుపాలెం

ఇబ్బందులు తప్పుతాయి



జీఎన్‌ఎంలో ఎంపికవడం చాలా ఆనందంగా ఉంది. ఒకప్పుడు మహిళలు ఇంటికే పరిమితం అయ్యేవారు. ఇప్పుడు ఇలాంటి అవకాశాలు మూలంగా వారంతా ముందుకు వచ్చి ఉద్యోగాలు పొందే వీలు ఏర్పడింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబానికి అండగా ఉంటా. మరెందరో మహిళలు చదువుకుని ఇటువంటి జాబ్‌మేళాల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు పొందాలని ఆశిస్తున్నా.

– ఎల్,లలిత, నల్లగొండ

25 నుంచి జిల్లాస్థాయి యువజనోత్సవాలు

- దరఖాస్తుల స్వీకరణకు 23 వరకు గడువు
- సెట్విన్ సీఈవో నాగేశ్వరరావు

పాడేరు రూరల్: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి యువజనోత్సవాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సెట్విస్ సీఈవో పి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక పోటీల్లో పాల్గొనే వారు 15 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులు ఈ నెల 23 వరకు స్వీకరిస్తామని చెప్పారు. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. జానపద నృత్యాలు, జానపద గేయాలు, వన్ యాక్ట్ ప్లే, వక్తృత్వ పోటీలు, సంప్రదాయ గాత్రం, నృత్యం, వాయిద్యం, మృదంగా, తబలా, హార్మోనియం, గిటార్, ఆధునిక గీతం, ఆధునిక నృత్యం, మోనో యాక్షన్, మిమిక్రీ, మ్యాజిక్, పెయిటింగ్, వయోలిన్, ఫ్యాన్సీ డ్రస్, క్విజ్, గ్రూప్ డిస్కషన్ తదితర అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం పొందిన జట్లకు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన జట్లను జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల యువత సంబంధిత మండలపరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. దరఖాస్తులను నేరుగా లేదా పోస్ట్ ద్వారా నవంబర్ 23లోగా పంపించాలని సూచించారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన అంశాలపైనే పోటీల్లో ప్రదర్శించాలని కోరారు. పూర్తి వివరాలకు 0891-2558291 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

గిరిజన యువతి హత్య కేసులో దర్యాప్తు

నిందితుడిని కఠినంగా శిక్షించాలని మహిళల ధర్నా

అరకులోయ రూరల్: దుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు పంచాయతీ నందివలస గ్రామంలో ఈ నెల 30న గెమ్మెలి సావిత్రి(19) అనే గిరిజన యువతిని అదే గ్రామానికి చెందిన జన్ని రామచంద్ర అనే గిరిజనుడు చంపేశాడు అనే అనుమానంతో మృతురాలి తండ్రి గెమ్మెలి కామేశ్వరరావు దుంబ్రిగుడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ సంతోష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, అరకు సీఐ దేముడుబాబు కేసు విచారణ జరిపారు. ఈ సందర్భంగా సోమవారం అరకులోయ పోలీసు స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ ఈ కేసులో ప్రత్యేక పోలీసు బృందంతో దర్యాప్తు నిర్వహించడం జరిగిందని తెలిపారు. నిందితుడు రాంచందర్ పరారీలో ఉన్నాడని అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి...

సావిత్రిని హత్యచేసిన రామచందర్‌ను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.వి. జయ అన్నారు. అరకులోయలో సోమవారం మహిళా సంఘలతో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. సావిత్రి హత్య బాధాకరమన్నారు. ఇటువంటి సంఘటనలు మారుమూల గ్రామాల్లో కూడా చోటు చేసుకుంటూ ఉండడంతో మహిళలు భయాందోళనకు గురి అవుతున్నారన్నారు. హంతకుడిని కఠినంగా శిక్షించినపుడే ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు సన్యాసమ్మ, సుందరమ్మ, విజయ, జోషి పాల్గొన్నారు.

గుడిసె పర్యాటకంపై ఆంక్షల కొనసాగింపు

రంపచోడవరం: గుడిసె పర్యాటకంపై ఆంక్షలు కానసాగుతున్నాయి. మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీ పరిధిలోని గుడిసె గ్రాస్ ల్యాండ్ పర్యాటక ప్రాంతానికి పర్యాటకులు ఎవరికి అనుమతి లేదని సోమవారం రంపచోడవరం డీఎఫ్‌వో నరేందిరన్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబరు 28 వరకు గుడిసె పర్యాటక ప్రాంతానికి పర్యాటకులు వెళ్లేందుకు అనుమతి లేదని కలెక్టర్ గతంలో ఉత్తర్వులు ఇచ్చారు. అయితే వాటి గడువు ముగియడంతో డీఎఫ్‌వో నవంబర్ ఒకటి నుంచి గుడిసె ప్రాంతానికి పర్యాటకులు ఎవరికి అనుమతి లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి పాఠశాల సమస్యలు

దుంబ్రిగుడ: కిల్లోగుడ గిరిజన సంక్షేమ శాఖ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేసిన అనంతరం ఏటీడబ్ల్యూవోకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఏటీడబ్ల్యూవో పాఠశాలను సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మెనూ సక్రమంగా అమలుచేయడం లేదని, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ సమస్య ఉందని, రాత్రి వేళల్లో వార్డెన్ ఉండడం లేదని, ఉడకని అన్నం పెడుతున్నారని, రాత్రి మిగిలిన అన్నాన్ని ఉదయం ఇస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి నివేదిక అందజేస్తానని, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.



సమస్యలపై ఏటీడబ్ల్యూవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థినులు

పర్యాటక ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణం

అనంతగిరి: పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణానికి కృషిచేస్తామని, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని విలేకరులతో మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు దేశనలుమూల నుంచి పర్యాటకులు వస్తుంటారన్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని, స్థానికులు కోరుతున్నారని చెప్పారు. అనంతగిరి, ములియగుడ, బొర్రా తదితర పర్యాటక ప్రాంతాల్లో మరుగుదొడ్లు నిర్మాణానికి కృషిచేస్తామని, ఇందుకు అధికారులు సహకారం అందించాలని ఆమె కోరారు.



శోభ సోమేశ్వరి

సొంతింటి కల జగనన్నతో సాకారం



గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: సొంతింటి కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాకారమని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. శరభన్నపాలెంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన గృహల నిర్మాణాలకు వారు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహాల గ్రౌండింగ్ పనులు విస్తృతం జరుగుతున్నాయన్నారు. పాడేరు డివిజన్‌లో 11,522 గృహాలకు సంబంధించి ఇప్పటి వరకు 2436 గృహాల పనులు చేపట్టారన్నారు. గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలో నగదు జమచేస్తోందన్నారు. ప్రస్తుతం 49లే అవుట్లలో 1094 మంది పనులు చేపట్టారని, మరో 107 మంది పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. పాడేరు హౌసింగ్ ఈఈ బాబు, ఏఈ కె వెంకటరమణ, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: దారెల పంచాయతీ పెద్దపేట గ్రామంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన 33 గృహాల నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్ సోమవారం ప్రారంభించారు.

చింతపల్లి: మండలంలోని ప్రభుత్వం ద్వారా మంజూరైన 65 గృహాల నిర్మాణాలకు జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, సర్పంచ్ పుష్పలత ప్రారంభించారు.

గంగవరం: బర్రిమామిడి, కుసుమరాయి గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణాలకు జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం, సర్పంచ్ రాజమ్మ, తహసీల్దార్ శ్రీమన్నారాయణ తదితరులు ప్రారంభించారు.